క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నెల్లూరు రూరల్: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నవాలకులతోట దొరతోపు సంఘంలో చోటు చేసుకుంది. వివరాలు..దొరతోపు సంఘానికి చెందిన షేక్ జమాల్‌బాషాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఫయాజ్(18) సంతానం. ఫయాజ్ వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. అవివాహితుడైన ఫయాజ్ గత కొంతకాలంగా తన తల్లిదండ్రులు తరచూ గొడవలు పడుతున్నారని మనోవేదన చెందుతుండేవాడు. ఆదివారం రాత్రి కూడా తల్లిదండ్రులు గొడవపడి ఇంటి ఆవరణంలో నిద్రిస్తున్న సమయంలో ఫయాజ్ ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయాన్నే తండ్రి జమాల్‌బాషా ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకుని ఉన్న కుమారుడ్ని చూసి బోరున విలపించాడు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. అనంతరం మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కూలీ మృతి

నెల్లూరు రూరల్: సౌత్‌మోపూరులో గుండెపోటుతో ఓ వ్యవసాయ కూలీ సోమవారం మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వేణు(28) కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజూ ధాన్యం బస్తాలు లోడ్ చేసే పనులకు వెళుతుంటాడు. రోజులాగే సోమవారం జెడ్పీ హైస్కూల్ సమీపంలో లారీకి ధాన్యం బస్తాలు లోడ్ చేస్తుండగా ఒక్కసారిగా గుండెనొప్పితో కుప్పకూలాడు. తోటి కూలీలు ఏమైందని ప్రశ్నించగా గుండెల్లో నొప్పిగా ఉందని చెప్పాడు. అక్కడే ఉన్న ధాన్యం కొనుగోలుదారుడు తన బైక్‌పై వేణును ఎక్కించుకుని ఇంటి వద్దకు తీసుకెళుతుండగా మార్గం మధ్యలో అతడిపై వాలిపోయాడు. అనంతరం నెల్లూరులోని జీజీహెచ్‌కు అంబులెన్స్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లుగా నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. మృతుడికి భార్య, మూడు నెలల పాప ఉన్నారు. వేణు మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా వేణు మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

చెరువులో గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు రూరల్: సౌత్‌మోపూరు చెరువులో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. వీఆర్వోకు సమాచారం అందజేయగా నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు చెరువు వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించారు. మృతదేహం స్వభావం ఆధారంగా మూడ్రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

సబ్సిడీపై విత్తనాల పంపిణీ

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు వివిధ రకాల విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలైన జనుములు, జీలుగలు 50 శాతం సబ్సిడీతో ఇస్తున్నామని చెప్పారు. రాగులు, కందుల మినీకిట్లను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు.

పేపర్ క్రాఫ్ట్ పోటీలకు ఆహ్వానం

నెల్లూరు (దర్గామిట్ట): ఆగస్ట్ 1న అంతర్జాతీయ కాగిత దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వ సమాచార- ప్రసార మంత్రిత్వ శాఖ, పేపర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీశ్రీ ఏజెన్సీస్, నెల్లూరు సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రోత్సహించే ఉద్దేశంతో పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నెల్లూరులోని అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులతో పేపర్ క్రాఫ్ట్‌లు తయారు చేయించి ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేసి ఈ నెల 20వ తేదీలోగా 94403 89999 నంబర్‌కు వాట్సప్‌లో పంపాలని కోరారు. ఈ నెలాఖరులో పాఠశాల స్థాయి విజేతల పేపర్ క్రాఫ్ట్‌లతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించి 20 మంది విజేతలను ఎంపిక చేస్తామన్నారు. ఆగస్ట్ 1న విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేస్తామని తెలిపారు.

స్పాస్టిక్ సెంటర్‌లో అన్నదానం

నెల్లూరు(బారకాసు): నగరంలోని మద్రాసు బస్టాండ్ సమీపంలో ఉన్న రెడ్‌క్రాస్ రక్తనిధి ప్రాంగణంలోని స్పాస్టిక్ సెంటర్‌లో చిరమణ బాలయ్య జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు సోమవారం అన్నదానం చేశారు. రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడు, మాజీ రంజీ క్రీడాకారుడు కోటారెడ్డి, బాలయ్య కుమారుడు పరమేశ్వరరావు, వాణి దంపతులు, వాసవీలత, మల్లికార్జునరావు, ప్రశాంత్, సెంటర్ ప్రిన్సిపల్ గురునాథం, ఏఆర్వీ క్లీనిక్ కన్వీనర్ ఇంకురెడ్డి, కార్యదర్శి మస్తానయ్య పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికే సంక్షేమ పాలన



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పాలన సాగిస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తవంగల్లులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పేదల కోసం అమలు చేస్తున్నామని, ఏ ఒక్క పేదవాడికీ సంక్షేమ పథకాలందని పరిస్థితి ఉండకూడదనే ఎమ్మెల్యేలను ప్రతి ఇంటికీ పంపుతున్నారని తెలిపారు. ప్రతి ఇంటికీ ఎమ్మెల్యే స్వయంగా వెళ్లడం వల్ల ఏవైనా సమస్యలుంటే తక్షణం పరిష్కరించే వెసులుబాటు కలిగిందన్నారు. సాంకేతిక పరమైన సమస్యలుండి అర్హులు పథకాలకు దూరం కాకూడదనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అధికారులను ప్రతి ఇంటి తలుపు తట్టేలా చేశారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 83,819 గడపలు తిరిగితే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల కారణంగానే ప్రతిఇంటా సంతోషంగా ఉన్నారని చెప్పారు. గడప గడపలో తనను ఆనందంగా ఆశీర్వదిస్తున్నారంటే అందుకు ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే కారణమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓ జి.వసంతకుమారి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీపీ గాలి జ్యోతి, ఎంపీటీసీ నంబూరి ప్రసాద్, సర్పంచ్, ఉప సర్పంచ్‌లు అమవరపు సింధు, చక్కా శైలజ, నాయకులు మనోహర్‌బాబు, వెంకటేశ్వర్లు, హరిబాబు, మల్యాద్రి, బొర్రయ్య, నవీన్, రమణయ్య, కుమార్, రామయ్య పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు



గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రత్యూష, ఎంఈఓలు

నెల్లూరు : పిల్లలు ప్రశాంతంగా చదువుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించారని ఎంపీడీఓ ప్రత్యూష అన్నారు. ముత్తుకూరులోని గొల్లవీధి గిరిజన కాలనీలో సోమవారం ఎంఈఓలు మధుసూదన, హేమ సుందరరావు, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి తదితరులు పర్యటించారు. బడి ఈడు పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యా కానుక, విద్యా దీవెన తదితర పథకాలతో పాటు పోషకాలు కలిగిన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం సమకూరుస్తోందని, పిల్లలకు ఉన్నత విద్య అందుతుందని చెప్పారు.

ఘనంగా మత్స్యకార దినోత్సవం



ప్రధాని ప్రసంగాన్ని వీక్షిస్తున్న మత్స్యశాఖ అధికారులు, మత్స్యకారులు

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో ఉన్న ఫిషింగ్ ల్యాండ్ సెంటర్‌లో మత్స్యకార దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని లైవ్ టెలికాస్ట్‌లో జిల్లా మత్స్యశాఖ జేడీఎం నాగేశ్వరరావు వీక్షించారు. అనంతరం జేడీఎం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 10వ తేదీన జాతీయ మత్స్యకార దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందుకు ప్రధాన కారణం 1957వ సంవత్సరంలో ప్రొఫెసర్ హీరాలాల్, డాక్టర్ ఆలీకున్నిలు కృత్రిమ గర్భధారణ ద్వారా మత్స్యసంపదను సృష్టించారని, దీనికి గుర్తుగా 2001వ సంవత్సరం నుంచి జూలై 10న జాతీయ మత్స్యకారుల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం పీఎంఎస్ఎస్‌వై ద్వారా మత్స్య పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీహరికోట జయలక్ష్మి, ఎంపీటీసీ రమణయ్య, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ఊటుకూరు శీనయ్య, ఏడీ రఘునాథ్‌బాబు, మత్స్యకారులు పాల్గొన్నారు.

పవన్ నీచ వ్యాఖ్యలు దురదృష్టకరం



తలమంచి సురేంద్రబాబు

తోటపల్లిగూడూరు : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న గ్రామ వలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేసిన నీచ వ్యాఖ్యలు దురదృష్టకరమని సచివాలయ మండల కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు అన్నారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం మాట్లాడుతూ ఎమ్మెల్యేగా రెండుచోట్ల పోటీచేసి ఎక్కడా గెలవలేని పవన్‌కళ్యాణ్ మతిభ్రమించి దిగజారుడు రాజకీయాలకు దిగుతున్నాడన్నారు. పవన్ నీచ రాజకీయాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో గట్టి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామ వలంటీర్లు ప్రజా సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ఇంటికే చేరవేస్తూ వారి మన్ననలు పొందుతున్నారని, అలాంటి వారిని సంఘ విద్రోహశక్తులుగా వర్ణించడం క్షమించరానిదన్నారు.

రోజూ లక్ష మందికి ఉపాధి



కూలీలతో మాట్లాడుతున్న పీడీ వెంకట్రావ్

మనుబోలు : జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా రోజూ లక్ష మందికి ఉపాధి కల్పిస్తామని డ్వామా పీడీ వెంకట్రావ్ అన్నారు. మండలంలోని మడమనూరు గ్రామంలో ఉపాధి హామీ పనులను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సరాసరి కూలి రూ.256 వస్తుందని తెలిపారు. గతేడాది రూ.202 మాత్రమే వచ్చేదన్నారు. రోజుకు కనీసం రూ.272 వచ్చేలా కూలీల చేత పనిచేయించాలని సిబ్బందికి సూచించారు. కనీసం నాలుగు గంటల పాటు పనిచేయాలని సూచించారు. పనులు జరిగే చోట కూలీలకు కనీస వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఏపీఓ రాజమ్మ, టీఏ రమేష్, ఎఫ్ఏ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



బుచ్చిరెడ్డిపాళెం: అనుమతుల్లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ అధికారులు ఆదివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ సూర్యనారాయణ కథనం మేరకు.. సాధారణ తనిఖీల్లో భాగంగా వాహనాలను పరిశీలిస్తుండగా బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని శేషాద్రినగర్ వద్ద రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి వీటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ట్రాక్టర్ డ్రైవర్లు నాగరాజు, సందీప్‌లపై కూడా కేసు నమోదు చేశారు. అనంతరం ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని సెబ్ సీఐ హెచ్చరించారు.

కారు ఢీకొని దంపతులకు గాయాలు



గాయపడిన శాంతి

మనుబోలు : మోటార్‌బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని బద్దెవోలు రోడ్డు వద్ద హైవేపై సోమవారం జరిగింది. బద్దెవోలు గ్రామానికి చెందిన గూడూరు వెంకటకృష్ణయ్య తన భార్య శాంతి, కుమార్తెతో కలిసి మోటార్‌బైక్‌పై గూడూరుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. హైవేపై బద్దెవోలు క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా గూడూరు నుంచి నెల్లూరు వైపు వేగంగా వెళ్తున్న కారు మోటార్‌బైక్‌ను ఢీకొంది. దీంతో వెంకటకృష్ణయ్య, శాంతిలకు గాయాలయ్యాయి. పాపకు ఎటువంటి గాయాలు కాలేదు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పొదలకూరు : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 12వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సుబ్బరాయుడు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి సోమవారం తెలిపారు. అజెండాలో ప్రధానంగా వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై చర్చిస్తామన్నారు. కావున జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరు కావాల్సిందిగా కోరారు.

నేడు కళయకాగొల్లులో 'జగనన్న సురక్ష'

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని కళయకాగొల్లు గ్రామంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుధీర్ సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొని స్థానిక సమస్యలను తెలుసుకుంటారని, ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాలుగో సచివాలయంలో..

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని నాలుగో సచివాలయం వద్ద మంగళవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో అర్హులకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందిస్తారన్నారు.

నేడు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్న బలిజ సేవా సంఘం వారు సోమవారం తెలిపారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. సాయంత్రం స్వామికి పల్లకిసేవ, అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తామని వెల్లడించారు.

ఊసపల్లికి పది బోర్ల మంజూరు



నిమ్మతోటలో బోరు వేస్తున్న యంత్రం

పొదలకూరు : మండలంలోని ఊసపల్లి గ్రామంలో వైఎస్సార్ జలకళ పథకం కింద మంజూరైన బోర్లను సోమవారం నుంచి వేస్తున్నారు. గ్రామానికి మొత్తం 10 బోర్లు మంజూరైనట్లు సచివాలయ కన్వీనర్ మలిశెట్టి మాల్యాద్రి పేర్కొన్నారు. మూడు రోజుల పాటు గ్రామంలో రైతుల పొలాలు, నిమ్మతోటల్లో బోర్ల నిర్మాణం జరుగుతుందన్నారు. తొలిరోజు ఏర్పాటు చేసిన బోర్లలో నీరు పుష్కలంగా పడింది. మండలంలో విడతల వారీగా ప్రాధాన్యత క్రమంలో రైతులు దరఖాస్తులు చేసుకుంటే బోర్లను వేస్తారు. ఇప్పటి వరకు నావూరుపల్లి, చెన్నారెడ్డిపల్లి, తోడేరు, ఆల్తుర్తి, కనుపర్తి, పులికల్లు, మొగళ్లూరు, నావూరు, ఊసపల్లి తదితర ప్రాంతాల్లో వైఎస్సార్ జలకళ కింద బోర్ల నిర్మాణం చేపట్టారు. ఆర్థిక స్తోమత లేని రైతులకు బోర్ల నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు వెల్లడించారు.

వైభవంగా సాయిబాబా నగరోత్సవం

నెల్లూరు(బృందావనం): గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా గాంధీబొమ్మ సమీపంలోని షిర్డీసాయిబాబా మందిరంలో సోమవారం సాయినాథుడి నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయినాథుడు గంధర్వ వాహనంపై విశేషాలంకారంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. నగరోత్సవం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నగరోత్సవ ఏర్పాట్లను మందిర కమిటీ చైర్మన్ మన్నెం అమర్‌నాథ్‌రెడ్డి పర్యవేక్షించారు.

సోమిరెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు



కనుపూరు చెరువులో మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న రైతులు, నాయకులు

- లోకేశ్ పాదయాత్రకు రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్
- ఇవ్వకపోవడంతో అక్రమ తవ్వకాలంటూ ఆరోపణలు
- నిజనిర్ధారణ కమిటీ కన్వీనర్ అడపాల



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వెంకటాచలం: అవినీతి, అక్రమాలకు అలవాటుపడిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నాడని ఇస్కపాళెం సర్పంచ్, నిజనిర్ధారణ కమిటీ కన్వీనర్ అడపాల ఏడుకొండలు విమర్శించారు. వెంకటాచలంలోని కనుపూరు చెరువులో ఇరిగేషన్‌శాఖ అధికారుల అనుమతులతో మట్టి తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాన్ని పలు గ్రామాల రైతులు, నాయకులు సోమవారం పరిశీలించారు. మట్టి తవ్వకాల వల్ల నీటినిల్వ సామర్థ్యం పెరిగి రైతులకు ప్రయోజనం ఉంటుందని అందరూ ఏకాభిప్రాయంతో ఇరిగేషన్ అధికారులకు, తహసీల్దార్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. కనుపూరు చెరువులో మట్టి తవ్వకాల వల్ల ఆయకట్టు రైతులకు ఎటువంటి నష్టం లేదని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా నిజనిర్ధారణ కమిటీ కన్వీనర్ ఏడుకొండలు మాట్లాడుతూ ఆయకట్టు రైతుల సమ్మతి, ఇరిగేషన్ అధికారుల అనుమతులతో నిర్వాహకులు మట్టి తవ్వకాలను చేపడుతుంటే అవినీతి సొమ్ముకు అలవాటుపడిన సోమిరెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల సర్వేపల్లి నియోజకవర్గంలో లోకేశ్ పాదయాత్ర కోసం రూ.10 లక్షలు ఇవ్వాలని నిర్వాహకులను సోమిరెడ్డి డిమాండ్ చేశారని, తాము ఇవ్వలేమని చెప్పడంతో తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. తన రాజకీయ ఉనికి కోసం సోమిరెడ్డి రోజురోజుకు దిగజారి ప్రవర్తిస్తున్నాడని పేర్కొన్నారు. ఆయకట్టు రైతులందరికీ మేలు చేకూర్చే పనిని అడ్డుకోవాలని చూడటం మంచి పద్ధతి కాదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సర్వేపల్లి నియోజకవర్గంలో బరితెగించి అనుమతులు లేకుండానే గ్రావెల్, మట్టి తవ్వకాలను ప్రోత్సహించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికే ఐదు దఫాలు ఎన్నికల్లో ఓటమిపాలైన సోమిరెడ్డి హుందాతనంతో రాజకీయాలు చేస్తే మంచిదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయంలో వినతుల స్వీకరణ



వినతిపత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వీరవసంతరావు వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతుల నుంచి సోమవారం వినతిపత్రాలను స్వీకరించారు. ప్రధానంగా పొలాలకు సంబంధించిన దారులు, పట్టాదారు పాసుపుస్తకాలపై వినతులను అందజేశారు. తాము సాగుచేసుకుంటున్న భూములను తమకే అసైన్మెంట్ కమిటీ జాబితాలో పెట్టి భూములను అందజేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేష్ ఏఈలు శివమోహన్, కసనానాయక్, రవికుమార్‌రెడ్డి, ఏపీఓ రోజ్‌మేరీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సురేష్

మనుబోలు : రెవెన్యూపరమైన సమస్యలను పరిష్కరించి రోడ్డు నిర్మాణంలో తమ పొలాలు కోల్పోనున్న వడ్లపూడి రైతులకు న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ముదిరాజ్ సంఘం జిల్లా ప్రతినిధి ఈగా సురేష్ తహసీల్దార్ శివకృష్ణయ్యను కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కడప నుంచి కృష్ణపట్నం పోర్టు వరకూ నూతనంగా రహదారిని నిర్మిస్తున్నారని, ఇందుకోసం వడ్లపూడి రెవెన్యూ పరిధిలోని పలువురు రైతుల పొలాల్లో భూసేకరణ చేశారన్నారు. అయితే ఈ క్రమంలో పొలం అనుభవదారునిగా ఓ రైతు ఉండగా రెవెన్యూ రికార్డుల్లో మరో పేరు ఉండడంతో పలువురు రైతులు పరిహారం అందక నష్టపోయే పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు విన్నవించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు సంగరపు వాసు, దద్దోలు పెంచలయ్య ఉన్నారు.



చేప చిక్కేనా?

చేప చిక్కేనా.. పూట గడిచేనా? అన్నట్లుంటుంది మత్స్యకారుల జీవితం. పొట్ట నింపుకునేందుకు కొందరు మత్స్యకారులు వెంకటాచలం సమీపంలో జాతీయ రహదారికి పక్కనే ఉన్న చెరువులో చేపలు పడుతూ ఇలా కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

బైక్‌ను ఢీకొన్న బస్సు

- యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన దేవకుమార్

పొదలకూరు : బైక్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన పొదలకూరు పట్టణానికి సమీపంలో సోమశిల మార్గం చిట్టేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు.. కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బ ఎస్టీ కాలనీకి చెందిన చేవరు దేవకుమార్ చేజర్ల మండలం ఏటూరులో ఓ ఇంటికి గ్రానైట్ రాళ్లను పరిచే పనికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో పొదలకూరు మీదుగా కోవూరుకు బైక్‌పై వెళ్తుండగా బస్సు ఢీకొని గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని పొదలకూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.